సీరియల్ కథ :

# ప్రేమ పుష్పాలు!

★



రచన:

శ్రీ బుద్ధిరాజు నరసింహారావు

(గతసంచిక తరువాయి)

జయసుధ తండ్రి నిజంగానే తనకు మామని గ్రహించాడు చక్రవర్తి. కాని తల్లి అతనంటే ఎందుకంతగా అసహ్యించుకుంటోందో ఎంత ఆలోచించినా అంతుపట్టడం లేదు.

'అమ్మా! నామనసు నిజం తెల్సుకోవాలని తహతహలాడుతోంది, చెప్పమ్మా. అతనంటే నీకెందుకంత అసహ్యమో చెప్పు.

భాస్కరరావు మౌనంగా తల్లీ కొడుకులమధ్య జరిగే సంభాషణ వింటున్నాడు.

'ముందు నాప్రశ్నకి జవాబు చెప్పు బాబూ.'

'అడుగమ్మా!'

'నీవు ఆ అమ్మాయిని ప్రేమించావా?'

'అవునమ్మా, జయసుధని నేను మనసారా ప్రేమించాను.'

'ఆ అమ్మాయిని మరువలేవా?'

ఏమని సమాధానం చెప్పాలో అర్థం కాలేదు చక్రవర్తికి. అందుకే మౌనంగా వూరుకున్నాడు.

'జవాబు చెప్పు బాబూ.'

'వాడేం జవాబు చెప్తాడు కాంతం, నీవు మరీను.'

కొడుకు సందిగ్ధావస్థలో పడటంచూసి భాస్కరరావు అందుకున్నాడు. 'నిజం చెప్పకుండా డొంక తిరుగుడు ప్రశ్నలకి వాడు పాపం ఏం జవాబు చెప్పగలడు?'

'మీకు తెలియదండీ. ఆ సీతనేది ఒకవేశ్య. ఒక వేశ్య కూతురుతో చూస్తూ చూస్తూ సంబంధం చెయ్యడమా?'

'ఏమిటమ్మా నీవనేది. సీతగారు ఎంతో చక్కటిమనిషి. ఆవిడ వ్యక్తిత్వం నాకు బాగాతెలుసు,' చక్రవర్తి తల్లి మాటలకి అడ్డు చెప్పబోయాడు.

'అదేరా నాయనా పొరపాటు! దూరపుకొండల నునుపు చూసి అందరూ మురిసిపోతారు. తీరా దగ్గరికివెళ్ళి చూసి వాస్తవికం తెలుసుకుని బాధపడతారు.

'నీమాటలు నాకేం అర్థం కావడంలేదమ్మా!'

'బాబూ, నీ మేలుకోరే చెప్తున్నాను. మీ మామ ఒక సానిదాంతో లేచిపోయాడు, మానాన్న పరువు ప్రతిష్టలు గంగలో కలిసిపోయాయి. ఆ బాధతో అమ్మ చనిపోయింది. మానాన్న ఈ రెండుదెబ్బలు భరించలేకపోయారు. అయినా

నాకోసం, నాసుఖంకోసమే అంతకాలం జీవించినట్లున్నారు. అప్పటికి నాపెళ్ళి కాలేదు. పరువు పోయినతర్వాత ఆ వూరిలో వుండలేక నాన్న నన్ను తీసుకుని మరో ఊరికి వెళ్ళిపోయారు. అమ్మ పోయిన సంవత్సరానికి ఎలాగో నాన్నగారి ఎడ్రస్ తెలుసుకుని చలపతి ఆ సానిదాంతో ప్రత్యక్షమయ్యాడు. మా నాన్నగార్కి కోప మెక్కువ. నాకూ వాడంటే అసహ్యం పుట్టుకువచ్చింది. మా అమ్మ అకస్మాత్తుగా అంతబాధగా మరణించడానికి కారణంకూడా వాడే. మా నాన్నగారు వాడిని చూడగానే ఉద్రేకంతో, అంతులేని అసహ్యంతో పిచ్చివాడిలా అరిచారు. 'ఎందుకు వచ్చావురా అప్రాచ్యుడా. ఓహో, సానిముండని కూడా వెనకేసుకునే వచ్చావా, సంతోషం, కని-ఏలోటూ రాకుండా పెంచినందుకు మంచి ప్రతికారమే చేసేవు. ఏం, ఈఊళ్లో కూడా నే తలెత్తి తిరగకూడదా? ఏం, నన్ను చావ మంటావా, చెప్పు. అందుకుకూడా నే సిద్ధమే. కాంతం లేకపోతే ఏనాడో చచ్చేవుందును. ఈ అమాయకపుపిల్లని ఎవరికైనా ముడిపెట్టిపోదా మనకుంటున్నా, కాని, కాని, అదికూడా అయేటట్లు లేదు.'

చలపతి తల దించుకుని, 'నాన్నగారు, నన్ను అపార్థం చేసుకోకండి!' అన్నాడు.


అతనిమాట పూర్తి కాకుండానే నాన్నగారు తారా జువ్వలా లేచి బిగ్గరగా అరిచారు. 'అవునురా స్కౌండ్రల్. నీలాటివాడిని అర్థం చేసుకోడానికి మరో జన్మెత్తాలి. పో, తక్షణం బయటకు పో. లేదా నిన్ను నరికిపారేస్తాను, నేనూ చస్తాను!'

చలపతి అహం దెబ్బ తిన్నట్లుంది. లేక సీత ప్రక్కనుండడంవల్ల పౌరుషం వచ్చిందో, నాన్నగార్కి ఎదురు తిరిగాడు.

'నాకు తెలిసినంతమటుకు నేనేమంత చెయ్యరానినేరం చెయ్యలేదు. నన్నర్థం చేసుకోలేకపోతే, నామాట వినేశక్తి లేకపోతే అది మీ బలహీనత.' అని కసిగా సీతచేయి పట్టుకుని బయటకు వెళ్లిపోయాడు'

అంతే! ఆతర్వాత చలపతి జాడ తెలియలేదు.

రోజురోజుకీ నాన్నగారి అస్వస్థత ఎక్కువైంది. ఎలా

ఎల్. పి. సి. మోనోబ్లాకు రెండు స్టేజీ డీప్ వెల్

- జెట్ పంపులు -

రెండుస్టేజి పంపులు ఎక్కువగా అతిప్రెశర్‌లో సాధారణ జెట్ పంపుకన్నా నీళ్ళ నందించును.

ఎంత లోతైన బావినుండి అయినా సరే మా మోనోబ్లాకు జెట్ పంపు సెట్టులు అతిసులువుగా మీకు నీళ్ళు అందించును.

½ H.P. నుంచి 5 H.P. వరకు దొరకును.

వివరములకు

Grams : "NAIDUBROS" Phone : Office : 24997 Works : 22757

**THE EL-P-EM INDUSTRIALS**

393, Mettupalaym Road, (P.B. No. 1053) COIMBATORE-641 002.

**SALES BRANCHES :–**

**112, Zeera, Secunderabad - 3.**

**13/85, Jayachamarajendra Road, Bangalore - 2.**

**10, Municipal Market Building, Kokkalai, Trichur - 1.**

గై తేనేం. నా పెళ్ళి మీ నాన్నగారితో అయిన కొద్దిరోజులకే ఆయన మరణించాడు.

కాంతం కథ ముగించింది.

గదిలో కొద్దిక్షణాలు మౌనంగా గడిచాయి.

ఏం మాట్లాడాలో తండ్రీ కొడుకులకి అర్థం కాలేదు.

'అందుకే బాబూ, నీ మేలుకోరే చెప్తున్నాను ఆ అమ్మాయి కాకుండా లోకంలో యింకే అమ్మాయినైనా నాకు సంతోషమే కాంతం తిరిగి అంది,

'కాని కాంతం. ఆమె నిజంగా వేశ్యేనా?' సందిగ్ధంగా అడిగాడు భాస్కరరావు.

'లోకమంతా తెలిసినవిషయం. ముమ్మాటికీ సీతౌక వేశ్య. మీరే చెప్పండి. ఓ బజారుదాన్ని యింట్లోకి తెచ్చి పెళ్లాం అంటే ఏ తల్లి దండ్రు లొప్పుకుంటారు?'

'కాంతం, నేనుకూడా ఆమెని చూసాను. ఆమె చాలా సాత్వికంగానే కనిపించింది. మీరు పొరబడలేదుకదా? పోనీ ఆమెవల్ల పొరపాటున అలా జరిగి వుండవచ్చుకదా. పోనీ ఒక బజారుదీ అనుకుందాం. మీతమ్ముడు సంఘానికి ఎదురుతిరిగి ఆమెని ఆదరించి ఒక యింటిదానిగా, ఒక యిల్లాలిగా మార్చాడు. అలా అయివుంటే అతని ధైర్య సాహసాలకి నిజంగా మెచ్చుకోవాలి' అన్నాడు భాస్కరరావు తన అభిప్రాయం తెలుపుతూ.

'నేను మీతో ఏకీభవించలేను. రక్తం ధారపోసి, పెంచి పెద్దచేసిన తల్లిని తండ్రినీ వ్యతిరేకించి పదిమంది లో అవమానంపాలు చేసినవాడు అధముడు. ఎన్నటికీ క్షమించరానివాడు. చూడండీ, నానిర్ణయం మీతో చెప్పే సాను. మీరెంత నచ్చచెప్పినా చూస్తూ చూస్తూ ఒక సాని దానిబిడ్డతో నాకొడుక్కి ముడిపెట్టలేను. నన్ను క్షమించండి. అది ముమ్మాటికీ జరుగదు.' ఆయాసం రావడంతో ఆగిపోయింది కాంతం.

తీవ్రంగా దగ్గువచ్చి చుట్టుకుపోయిందామె. కాస్త రక్తం కూడా వెలువడింది. కళ్ళుతిరిగి పడబోతే చక్రవర్తి తల్లిని పట్టుకున్నాడు.

'అమ్మా, బాధపడకమ్మా:'

అంతలో మళ్ళీ పెద్దగా దగ్గుతూ అక్కడే వాంతి చేసుకుంది కాంతం.

పక్కనిండా రక్తం!

'నాన్నా! అమ్మని చూస్తూవుండు. డాక్టర్ని తీసుకువస్తా' నని బయటకు పరిగెత్తాడు చక్రవర్తి.

పదిరోజులవరకూ చక్రవర్తి కాలేజీకి వెళ్ళలేకపోయాడు, తల్లి అనారోగ్యంవల్ల.

ఆనాడు డాక్టర్ శశి వచ్చి తల్లికి 'టీ. బి' అని వెంటనే మదనపల్లె తీసుకెళ్ళమని సలహా యిచ్చింది.

అక్కడికి వెళ్ళాలంటే బోలెడు ఖర్చు. తండ్రివద్ద అంతడబ్బుకూడా లేదు. జీతంమీద అంతకుముందే ఎంతో అప్పు చేసేడు. ఎవరైనా అప్పిస్తారేమోనని చూస్తున్నాడు. కాని అలాంటి దాతా, దైవం ఎవరూ కనబడటంలేదు.

ఆరోజు శుక్రవారం.

ఆరోజు భాస్కరరావు శెలవుపెట్టి యింట్లోనేవున్నాడు కాబట్టి చక్రవర్తి కాలేజీకి వెళ్ళొస్తానని బయల్దేరాడు.

కాలేజీ చేరుకున్నాడు. ఇంటర్వల్‌లో కాలేజీగార్డెన్‌లో. జయసుధ మల్లె పొదప్రక్కగా కూర్చొని ఏదో పుస్తకం చదువుకుంటోంటే, అది గమనించి వడివడిగా ఆమెవైపు వెళ్ళాడు చక్రవర్తి.

'జయా' అన్నాడు.

జయసుధ ఉలిక్కిపడి తలెత్తింది.

ఎదురుగా చక్రవర్తినిచూసి నివ్వెరపోయింది.

'బావా?'

'ఆనాడు, మీ నాన్నగారికి జరిగిన అమర్యాదకి క్షమాపణ వేడుకోడానికి వచ్చాను జయా' చక్రవర్తి బాధగా అన్నాడు.

అప్రయత్నంగానే ఆమెకళ్ళు చెమ్మగిల్లాయి.

'నీకు తెలియదు బావా; ఆనాటినుండీ, మానాన్న ఎన్నడూ తేరుకోలేనంతబాధతో గుండెపోటువచ్చి మంచం పట్టాడు. దానికి బాధ్యులెవరు?'

'జయా, అందులో నాతప్పేమీ లేదు,'

'అవును, నీ తప్పేమీ లేదు. ఏవేవో పిచ్చిమాటలతో నాతండ్రిని అవమానపాలు చేస్తూవుంటే చూస్తూ ఊరుకున్నావు. నాతండ్రిగా, నీ మేనమామగా ఆయన పరువు ప్రతిష్ఠలు నిలిపేబాధ్యత నీకు లేదా?'

'ఉంది. కాని, ఆసమయంలో నామాట వినిపించుకుంటేకదా? దైవసాక్షిగా చెప్తున్నాను జయా, నేను

మిమ్మల్ని ఎన్నడూ అపార్థం చేసుకోలేదు, చేసుకోబోను కూడా. నిజంగా నీవు నా మరదలవనితెలిసి ఎంతగా మురిసిపోయానో. కాని, కథ అడ్డంగా తిరిగింది. పెద్దల మన స్పర్థలకి మన యిరువురిమధ్యా ఎటువంటి భేదభావాలు రాకూడదు. నిన్ను నేను మనసారా ప్రేమించాను. నిన్నే నా భార్యగా చేసుకుంటాను. నీతో.....'

చక్రవర్తిమాటలకు అడ్డుపడుతూ, 'బావా; అది సాధ్య పడదేమో. అందుకే నన్ను మరచిపో' అంది జయసుధ బాధగా.

'మరచిపోవడమా, ఎంత తేలిగ్గా అనేసావు.' జయా, అంత నిరాశచెందుతే ఎలా చెప్పు. జీవితాంతం యిద్దరం తోడుగా ఒకేబాట నడుస్తామని ఆనాడు చేసిన వాగ్దానం మరచేవా? జీవితం అన్నప్పుడు ఎండమావులు వుండనే వుంటాయి. కష్టాలతో పోటీపడి ఎదురుతిరిగి ధైర్యసాహసాలతో నిలబడేవాడే మానవుడు. నిరాశతో, కించితహృదయంతో జీవితంలో ఏదీ సాధించలేము,'

'నేనొక అర్హతలేని అమ్మాయినని నీకు తెలీదా?'

'నీకు అర్హత లేదని అనేవాళ్ళు సంకీర్ణహృదయులు.'

'మా అమ్మగురించి మీ అమ్మగారు చెప్పేవుంటారు.'

'చెప్పారు. కాని, నాదృష్టిలో మామయ్యే గొప్పవాడని, ఉత్తమవ్యక్తిత్వం గలవాడని నిర్ధారణ చేసుకున్నాను. విషమపరిస్థితులకు గురై, లేక పొరపాటున కాలుజారిన ఆడదాన్ని కాపాడి, సంఘానికి ఎదురునిలబడి ఆమె జీవితాన్ని నవవసంతంగా అలంకరించి తాళికట్టిన వ్యక్తి నా దృష్టిలో ఉత్తముడు, చక్రవర్తి ఆవేశంగా అన్నాడు.

'నిజం చెప్పాలంటే, మానాన్నగార్కి ఈ సంబంధమంటే యిష్టంలేదు, దానివల్ల మీకు చెడ్డపేరొస్తుందని మా అమ్మ నమ్మకం. నాన్నకు అత్తయ్యని బాధపెట్టడం యిష్టం లేదు.'

జయసుధ కళ్ళు ప్రక్కకి తిప్పుతుంది. అప్పటికీ ఆమె కళ్ళల్లో నిలచిన కన్నీటిబిందువులను గ్రహించేసాడు చక్రవర్తి.

'నేను అమ్మకి నచ్చజెప్తాను. కాస్త వ్యవధి కావాలి. అప్పటివరకూ నీవు ఎటువంటిబాధా మనసులో పెట్టుకోకు. మా అమ్మకికూడా అసలు ఒంట్లో బాగులేదు. డాక్టర్ 'టిబి' అని చెప్పింది. మదనపల్లి సేనిటోరియంలో జాయిన్ చెయ్యమంది. ఆర్థికస్థితి అడ్డురావడంతో వీలు కావడం లేదు. పోనీ నేనైనా జాబ్ చేద్దామంటే జాబ్ దొరకడం



లేదు. రోజులు గడుస్తున్నకొలంది అమ్మపరిస్థితి విష మిస్తోంది.'

'ఓహ్. బాధపడకు బావా! నాన్నతోచెప్పి వీలైనంత సహాయం చేయిస్తాను.

'ఏమిటీ, నీవు మామయ్యతో చెప్తావా? కాని, అది సాధ్యపడదేమో. అంత అవమానించి వెళ్ళగొట్టిన తర్వాత మామయ్య సహాయ మెందుకుచేస్తాడు? పోనీ ఆర్థికసహాయం చేసినా మా అమ్మ అంగీకరిస్తుందా. వద్దు జయా. అలా అయితే అమ్మ పరిస్థితి మరీ అధ్వానంగా తయారౌతుందేమోనని నా భయం.

'కష్టాలలో ఆదుకుని సాయశక్తులా తోడ్పడటం మానవ ధర్మం బావా! అదికాక స్వంతతమ్ముడేకదా, ఆమెకు తెలియకుండాకూడా సహాయపడవచ్చు బావా! మా నాన్నగారంటే నాకు పంచప్రాణాలు. ఆయనమాట ఎన్నటికీ నేను కాదన లేను. అయన నిన్ను మరచిపొమ్మని ఆజ్ఞాపించినా, నేవారి ఆజ్ఞ పాటిస్తాను. అటువంటి పరిస్థితి ఎదురైతే నన్నపార్థం చేసుకోవు కదూ?' అంటూ జయసుధ దీనంగా అతనివైపు చూసింది.

'అప్పుడు చూద్దాంలే మనం వస్తా జయా.' చక్రవర్తి వెనక్కితిరిగి వెళ్ళిపోయాడు.

జయసుధ అతను వెళ్ళినవైపేచూస్తూ వుండిపోయింది.

* * *

రెండురోజులు గడిచాయి.

కాంతం పరిస్థితి మరీ అధ్వాన్నంగా తయారైంది.

ఎక్కడనుండీ ఆర్థికసహాయం దొరక్కపోవడంతో భాస్కరరావుకి ఏంచెయ్యాలో అర్థం కావడంలేదు.

ఆరోజు ఆఫీసుకి శెలవు చీటీపంపి యింట్లో కూర్చున్నాడు.

మధ్యాహ్నం ప్రక్కింటి వామనరావు రావడంతో లేచి నిలబడ్డాడు భాస్కరరావు.

'రండి, రండి' సాదరంగా ఆహ్వానించాడు.

'భాస్కరరావుగారూ, వదినగార్కి అంత అనారోగ్యంగా వుందని నాకసలు చెప్పనేలేదే' అన్నాడు కుర్చీలో కూర్చుంటూ వామనరావు.

'అది నా పొరపాటేనండి. అసలు కాంతం అనారోగ్యం కాదుగాని, నామనసు అదుపులో లేదు. ప్లీజ్ తప్పుగా అర్థం చేసుకోకండి.

'అదీగాక, డాక్టర్ వదినగార్ని మదనపల్లి తీసుకువెళ్ళమని సలహా యిచ్చారట. మీ రెందుకలా 'డిలే' చేస్తున్నారో నాకర్థం కాలేదు.'

'ఆప్రయత్నంలోనే వున్నానండి. కాని' చెప్పడానికి భాస్కరరావు సంశయించేడు.

'మీ పరిస్థితి నాకర్థమైనదండి. సరే నేను ఓ మూడు వేలరూపాయలు మీకిస్తాను. వీలుచూసుకొని తిరిగిద్దురుగాని, వెంటనే మిరు బయల్దేరండి.'

'ఏమిటీ?' భాస్కరరావు నమ్మలేనట్లు చూసాడు.

'చూడండీ, కష్టాలలో ఒకరి కొకరు సహాయపడాలి. ఏమో, రేపు నాకూ అటువంటిపరిస్థితి ఏర్పడవచ్చుకదా? అదిసరేగాని. ఈరోజుసాయంత్రం బండిలోనే వదినగార్ని తీసుకువెళ్ళండి, 'డిలే' చెయ్యడం మంచిదికాదని మరో మారు చెప్తున్నాను. వస్తా. డబ్బు తెచ్చిస్తా!' అంటూ లేచా డాయన.

భాస్కరరావు లేచి కృతజ్ఞతగా అతని చేయిపట్టుకుని, 'మీమేలు జీవితాంతం మరచిపోలేను,' అన్నాడు.

'ఓహో, మీరంతగా బాధపడకండి,' అని అతని భుజం తడుతూ వామనరావు బయటకు వెళ్ళిపోయాడు.

—(సశేషం.)

కథాంజలి

[చక్కని కథల మాస పత్రిక]

స్థాపితం. 1938

విడి ప్రతి ... 50 పైసలు

సంవత్సర చందా ... రూ. 12-00

(రెండు ప్రత్యేక సంచికలతో సహా)

నేడే చందాదారులుగా చేరండి.

అన్ని హిగ్గిన్ బాథమ్స్ బుక్ స్టాల్సులో దొరుకును.

* కథాంజలి *

నెం. 10, మురుగేశ మొదలివీధి,

మదరాసు - 600 079.